## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

మియాపూర్, డిసెంబర్ 8 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన నివాసంలో ప్రమాదవశాత్తు కిందపడటంతో కాలికి గాయమైందని, అత్యంత బాధాకరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. తెలంగాణ ప్రజలందరి దీవెనలతో కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, మళ్లీ ప్రజల మధ్యలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు.



నూతనంగా ఏర్పాటు చేసిన వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌ను శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ.

– మాదాపూర్, డిసెంబర్ 8

## వార్షిక క్రీడా దినోత్సవం



కేంద్రీయ విద్యాలయ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో శుక్రవారం వార్షిక క్రీడా దినోత్సవం అట్టహాసంగా మొదలైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంజీవన్, లిజి బాబీ, ప్రిన్సిపాల్ ప్రియారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను.. వసూలుపై అధికారుల దృష్టి

**31 వరకు వడ్డీ లేకుండా ప్రాపర్టీ ట్యాక్స్ స్వీకరణ**



జూబ్లీహిల్స్,డిసెంబర్8: ఎన్నికల నేపథ్యంలో పేరుకుపోయిన ఆస్తిపన్ను వసూలుపై జీహెచ్ఎంసీ అధికారులు దృష్టి సారించారు. వందశాతం ఆస్తిపన్ను వసూలుతో సర్కిల్ పరిధిలోని వార్డులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో జీహెచ్ఎంసీ అధికారులు ఆస్తిపన్ను వసూలును వేగిరం చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఎన్నికల పనులలో నిమగ్నమైన అధికారులు పేరుకుపోయిన బకాయిల వసూలుకు చర్యలు వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో ఆస్తిపన్ను వసూలు చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్తున్నారు.

**డిసెంబర్ 31తో ముగియనున్న ఆస్తిపన్ను గడువు..**

ఈ ఏడాది 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను వందశాతం ఆస్తిపన్ను వసూలుకు జీహెచ్ఎంసీ అధికారులు కృషి చేస్తున్నారు. ప్రాపర్టీ ట్యాక్స్‌లో రెండో అర్ధభాగంపై అపరాధ రుసుము లేకుండా ఆస్తిపన్ను చెల్లింపులకు డిసెంబర్ 31 తో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చెల్లించాల్సిన ఆస్తిపన్నును ఈనెలాఖరుతో చెల్లించని వారు రూ. 2 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు మొండి బకాయిలపై దృష్టి సారించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆస్తి పన్ను చెల్లించాలని అవగాహన కల్పిస్తున్నారు.

**సకాలంలో చెల్లించి అభివృద్ధికి బాటలు వేయాలి..**

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి బాటలు వేయాలి. ఆస్తిపన్నుపై అదనపు పెనాల్టీ భారం పడకుండా ప్రాపర్టీ ట్యాక్స్‌ను డిసెంబర్ 31 లోపు చెల్లించాలి. పన్నులు సకాలంలో చెల్లిస్తే ప్రజలపై వడ్డీభారం తప్పుతుంది. ఈ మేరకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ లక్ష్యాన్ని చేరేందుకు కృషి చేస్తున్నాము. ఆస్తిపన్ను వసూలుకు అసిస్టెంట్ కమిషనర్ల ఆధ్వర్యంలో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల బృందాలు ప్రతి ఇంటికీ ప్రచారం చేపడుతున్నారు.

– సేవా ఎస్లావత్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, యూసుఫ్‌గూడ సర్కిల్

# ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం..

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన పలు కాలనీసంఘాలు



ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

మియాపూర్, డిసెంబర్ 8 : ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాజీలేని పోరాటం చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ప్రజల మధ్యే ఉండి వారి భాగస్వామ్యంతో ముందడుగు వేస్తానన్నారు. హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ , ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ నేతృత్వంలో తమ డివిజన్‌లకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేని శుక్రవారం ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అధిక నిధులను మంజూరు చేయించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల ప్రతినిధులు , కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గాంధీని గుల్మొహర్ పార్కు కాలనీ ప్రతినిధులు సైతం కలిసి సన్మానించారు.

- హైదర్‌నగర్ డివిజన్ మిత్రహిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రేస్ వృద్ధాశ్రమాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు దైవంతో సమానమని వారిని ప్రేమానురాగాలతో చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, కోనేరు ప్రసాద్, ప్రసాద్, యతీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.
- శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అధ్వర్యంలో ఆరంభ టౌన్‌షిప్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే గాంధీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆరంభ టౌన్‌షిప్ అధ్యక్షుడు రవీంద్ర రాథోడ్, నాయకులు అరుణశ్రీ, సరిత, మాధురి, బసవయ్య, నాగరాజు, జనార్దన్, విక్రమ్‌యాదవ్, సాయిరాం పాల్గొన్నారు.

## గోపన్‌పల్లిలో అయ్యప్ప మహా పడిపూజ



శేరిలింగంపల్లి, డిసెంబర్ 8 : గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి శ్రీరంగనాథస్వామి దేవాలయంలో అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిలతో కలిసి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ వెంకటేశ్



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న గుల్మొహర్ పార్కు కాలనీ వాసులు



ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న సిద్దిక్ నగర్ వాసులు

# సైనికుల్లా పని చేసి.. హ్యాట్రిక్ అందించారు

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- ఎర్రగడ్డ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం..
- పలువురికి సత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపీనాథ్

ఎర్రగడ్డ, డిసెంబర్ 8: ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, బూత్ ఏజెంట్లు, రిలీవర్లు, మహిళా నాయకుల సమావేశాన్ని శుక్రవారం డివిజన్‌లోని షంషీర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తనకు హ్యాట్రిక్ విజయాన్ని అందించటానికి సైనికుల్లా పని చేసిన పార్టీ నాయకులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ గత పదేండ్లుగా ఎర్రగడ్డలో జరిగిన అభివృద్ధి, క్రమశిక్షణతో కూడిన కార్యకర్తల పని తీరు ఈ ఎన్నికల్లో తన ఘన విజయానికి తోడ్పాటు అందించాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు జరిగిన అభివృద్ధిని, సంక్షేమాలను ఇంటింటికీ చేరవేశారని.. పార్టీకి మూల స్తంభాలైన కార్యకర్తలను ఈ విధంగా సత్కరించటం తనకు గర్వంగా ఉన్నదని పేర్కొన్నారు. ఎర్రగడ్డ విషయానికి వస్తే దశాబ్దాలుగా తిష్ట వేసిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్‌ఖురేషీ, తన్నుఖాన్, గంట మల్లేశ్, మహ్మద్‌సర్దార్, కృష్ణకుమార్, సలీం జావిద్, అజీమ్, మహ్మద్‌అహ్మద్, ముస్తాక్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన డివిజన్ పార్టీ శ్రేణులు



మైనార్టీ మహిళకు అభివాదం చేస్తూ..



డివిజన్ నాయకుడికి సన్మానం చేసి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

## పెండ్లికి నిరాకరించిన వ్యక్తిపై కేసు నమోదు

వెంగళరావునగర్, డిసెంబర్ 8 : నిశ్చితార్థం జరిగిన అనంతరం పెండ్లికి నిరాకరించిన వ్యక్తి పై ఎస్.ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రవిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్ నగర్ లోని బుద్ధనగర్‌కు చెందిన యువతి(27)తో ఓ మ్యారేజ్ బ్రోకర్ ద్వారా జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్న గుంటూరుకు చెందిన బాజీబాబు(32)తో ఆగస్టు 19వ తేదీన నిశ్చితార్థం జరిగింది. కాగా నిశ్చితార్థం జరిగిన అనంతరం బాజీబాబు పెండ్లికి నిరాకరించడంతో బాధితురాలి కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.